క్లుప్తంగా

వేడుకగా తిరిచ్చి ఉత్సవం



ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఇందుకూరుపేటలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీనరసింహస్వామికి తిరిచ్చి ఉత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు. హనుమంతసేవను రాత్రి జరిపారు. రంగాచార్యులు, నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సిమెంట్, స్టీల్ వ్యాపారం చేస్తున్న తిరుపతి జిల్లా కోట క్రాస్ రోడ్డుకు చెందిన మురళీమోహన్‌రెడ్డి తన తల్లి సులోచనమ్మను నగరంలోని ఓ హాస్పిటల్‌కు గత నెల 14న తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైకు ఆమెను తీసుకెళ్లారు. ఈ క్రమంలో తన ప్యాషన్ ప్లస్ బైక్‌ను నేషనల్ హైవే కార్యాలయ సమీపంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీ గోదాము పక్కన నిలిపి వెళ్లారు. 19వ తేదీన వచ్చి చూడగా బైక్ కనిపించ లేదు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని వాహనచోదకుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టకు చెందిన సమీర్ అహ్మద్ వేదాయపాళెం నుంచి ఇంటికి బైక్‌పై శుక్రవారం రాత్రి బయల్దేరారు. కొండాయపాళెం గేట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో సమీర్ అహ్మద్ గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి

నెల్లూరు(క్రైమ్): వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ భార్యపై దాడి చేసిన ఘటనలో భర్తపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లిలోని దండోరా కాలనీకి చెందిన విశ్రాంత తెలుగుగంగ ఉద్యోగి లక్ష్మయ్య కొంతకాలంగా ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ భార్య రత్నమ్మను వేధిస్తున్నారు. ఈ నెల రెండో తేదీ రాత్రి ఆయన, ఓ మహిళ, మరో ముగ్గురితో కలిసి ఇంటికొచ్చి రత్నమ్మపై దాడి చేశారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు రావడాన్ని గమనించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె మృతి అనుమానాస్పదమని ఫిర్యాదు

- రెండు నెలల క్రితం వివాహిత మృతి
- ఖననం చేసిన కుటుంబసభ్యులు
- తహసీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం

నెల్లూరు(క్రైమ్): ఓ వివాహిత, ఆమె స్నేహితుడు ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టారు. వివాహిత మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఖననం చేశారు. రెండు నెలల తర్వాత తన కుమార్తె మృతి అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ సమక్షంలో మృతదేహానికి పోస్టుమార్టాన్ని నిర్వహించారు. పోలీసుల సమాచారం మేరకు.. కసుమూరులోని ఇస్లాంపేటకు చెందిన మహబూబ్‌బాషా, హాజీరాబేగం దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అఫ్రోజ్ (20) ఇంటర్మీడియట్ చదువుకునే సమయంలో అదే ప్రాంతానికి చెందిన గౌస్‌బాషాతో చనువుగా ఉండటంతో గమనించిన కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. గతేడాది నవంబర్‌లో జ్యోతినగర్‌కు చెందిన షబ్బీర్‌తో ఆమెకు వివాహం చేశారు. అఫ్రోజ్ చెల్లెలు మొబీనా ప్రేమ వివాహం చేసుకొని శెట్టిగుంటరోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి నాలుగున అఫ్రోజ్ తన చెల్లెలి ఇంటికెళ్లారు. అదే రోజు గౌస్‌బాషా అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో వారు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. మరుసటి రోజు ఉదయం బెడ్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న తన అక్క, గౌస్‌బాషాను గమనించిన మొబీనా విషయాన్ని తన తల్లికి తెలియజేశారు. ఆమెను లేపేందుకు యత్నించగా, అప్పటికే మృతి చెంది ఉండటంతో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు గౌస్‌బాషాను తరలించారు. హాజీరాబేగం తన అల్లుడికి విషయాన్ని తెలియజేశారు. నెల్లూరుకు చేరుకొని గుట్టుచప్పుడు కాకుండా అఫ్రోజ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి ఖననం చేశారు. కాగా తన కుమార్తె మృతి అనుమానాస్పదంగా ఉందంటూ నవాబుపేట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసును ఎస్సై తిరుపతయ్య నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులతో కలిసి ఇస్లాంపేటకు నెల్లూరు తహసీల్దార్ నిర్మలానందబాబు చేరుకున్నారు. తహసీల్దార్ సమక్షంలో మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేశారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాశ్వత ప్రాతిపదికన సాగునీటిని అందిస్తాం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



అమ్మవారిపాళెం ఎస్సీ కాలనీలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : మండలంలోని అమ్మవారిపాళెం, ప్రభగిరిపట్నం గ్రామాలకు శాశ్వత ప్రాతిపదికన సాగునీటిని అందజేస్తామని, తమ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమ్మవారిపాళెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి శనివారం నిర్వహించారు. రూ.20 లక్షలతో పూర్తయిన సైడ్‌డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేయడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమశిల దక్షిణ కాలువ నిర్మాణం అటవీశాఖ అనుమతులు లభించక పనులు నిలిచాయన్నారు. ఇందువల్ల అమ్మవారిపాళేనికి శాశ్వత ప్రతిపదికన సాగునీరు అందడం లేదన్నారు. వీటిని పరిష్కరించి నీటిని అందజేస్తామన్నారు. గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

సోమిరెడ్డిది కడుపు మంట

ఈ ఏడాది రైతులంతా బాగున్నారని, ధాన్యానికి ఊహించని రీతిలో ధరలు లభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీంతో ప్రతిపక్ష నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి కడుపు మండిపోతున్నట్లు విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తే మాట్లాడేందుకు ఏమీ ఉండదని సోమిరెడ్డి తెగ బాధపడిపోతున్నట్లు పేర్కొన్నారు. రాజు మంచివాడైతే ప్రజలు సుభిక్షంగా ఉంటారనేందుకు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే సాక్ష్యమన్నారు. నాలుగేళ్లుగా సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండి పంటలు బాగా పండుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పి.లచ్చారెడ్డి, గ్రామ సర్పంచ్ అనంతనేని ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మి అరుణ, నేతలు అనంతనేని మనోహర్‌నాయుడు, కొమ్మి సుబ్బానాయుడు, అనంతనేని ధనంజయ, కోదండయ్య, కొమ్మి రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి



ప్రచారం చేస్తున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కోవూరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, తదితరాల్లో ప్రచారాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ అమూల్యమైన ఓటును తమ పార్టీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నో పరిశ్రమలు వచ్చాయని.. రానున్న రోజుల్లో మరిన్ని వస్తాయని వెల్లడించారు. పట్టభద్రులకు సముచిత న్యాయం చేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారని వివరించారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ కళాశాలలను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, డీఎల్డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వినీత్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను తప్పక పెంచాలి



మొక్కలు నాటుతున్న అధికారులు

కొడవలూరు: కొడవలూరులోని ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలను స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో శనివారం నాటారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సూరజ్ మాట్లాడారు. మానవాళికి చెట్ల పెంపకం కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, గురుకుల ప్రిన్సిపల్ దేవసహాయం, ఏపీఓ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో వార్షిక వేడుకలు



పూజలందుకుంటున్న సాయినాథుడు

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామంలో ఉన్న సాయిబాబా మందిరంలో 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు లక్ష్మీనారాయణ మందిరంలో సాయినాథునికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించి నవగ్రహ మండపారాధన, హోమాలను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపించారు. సాయంత్రం సాయినాథున్ని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. తలమంచి సోదరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. గ్రామపెద్ద వెందోటి భాస్కర్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మూడెకరాల్లో మామిడి మొక్కల నరికివేత



నరికివేతకు గురైన మామిడి మొక్కలు

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో మూడెకరాల పొలంలో సుమారు 300 మామిడి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. బాధిత రైతు సమాచారం మేరకు.. విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి రఘురామిరెడ్డి మొగళ్లూరు గ్రామంలో 20 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి నిమ్మ, మామిడి మొక్కలను నాటి సాగు చేస్తున్నాడు. ఈ తోట ఊరికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. శనివారం పక్కతోటల రైతులు మొక్కల నరికివేతను గుర్తించి రఘురామిరెడ్డికి సమాచారం అందించారు. రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే చెట్లను నరికివేసినట్లుగా తెలుస్తోంది. స్థానికులా లేక బయటి వ్యక్తులు నరికివేతకు పాల్పడ్డారా? అనేది తెలియరావడం లేదు. ఈ మేరకు బాధిత రైతు పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉగాది పర్వదినాన గృహ ప్రవేశాలు



జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ముత్తుకూరు : ఉగాది పర్వదినం రోజున జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్లకు సంబంధించి గృహ ప్రవేశాలు జరుగుతాయని హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. బ్రహ్మదేవి, ఈదులవారిపాళెంలోని జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన శనివారం పరిశీలించారు. కాలనీల్లో పక్కాగృహాలు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటివరకు 714 పక్కాగృహాలు పూర్తయ్యాయని చెప్పారు. ఈదులవారిపాళెం కాలనీలో గృహ ప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. పక్కాగృహాలకు అవసరమైన మెటీరియల్‌కు సంబంధించి ఎటువంటి కొరత లేదన్నారు. బిల్లుల చెల్లింపులు కూడా సకాలంలో జరుగుతున్నాయని వివరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం డీఎస్పీ దంపతులను శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అలగానిపాడులో ప్రత్యేక పూజలు



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): మండలంలోని అలగానిపాడు గిరిజన కాలనీలో నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, కుంభపూజ, తదితరాలను జరిపారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులు, నాగజ్యోతి వ్యవహరించారు. సర్పంచ్ వివేకానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలికలకు ఉపకార వేతనాలు

- హాజరుకానున్న మంత్రి కాకాణి

పొదలకూరు : కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ వారు బాలిక విద్యా పథకం ద్వారా ఉపకార వేతనాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ద్వారకామయి కల్యాణ మండపంలో అందజేస్తారని జోనల్ మేనేజర్ మాధవన్ శనివారం పేర్కొన్నారు. కార్యక్రమంలో కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటనలో మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం చోటుచేసుకుంది. నాయుడుపేట పట్టణానికి చెందిన వెంకటేశ్వరరావు భగవాన్ వెంకయ్యస్వామి దర్శనం కోసం బస్సులో గొలగమూడి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి గొలగమూడికి వెళ్లే ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా, నెల్లూరు వైపు నుంచి వెంకటాచలం వైపు వెళ్లే ఆటో అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో గాయపడిన వెంకటేశ్వరరావును చికి త్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు

కోవూరు: పట్టణంలోని టీఎస్సీ జూనియర్ కళాశాల ఎదురుగా గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. కరెంట్ వైర్లు కాలి పొగ రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త వేయడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఏడీ సతీష్‌కుమార్ తెలిపారు.

హౌసింగ్ ఏఈగా శివమోహన్

పొదలకూరు : మండల హౌసింగ్ ఏఈగా ఎం.శివమోహన్ బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరు గోడౌన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివమోహన్‌ను ఏఈగా నియమించారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న భాస్కర్ సీతారామపు రానికి బదిలీ అయ్యారు. హౌసింగ్ డే సందర్భంగా మరుపూరు గ్రామంలోని ఇళ్ల నిర్మాణాలను ఏఈ శనివారం పరిశీలించారు.

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం పల్లకిసేవ, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



అపర్ణ వద్ద వేలిముద్రలు తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్

పొదలకూరు : ప్రభుత్వ పింఛన్ల పంపిణీలో భాగంగా పొదలకూరు బిట్-1 వెల్ఫేర్ అసిస్టెంట్ భార్గవ్ నెల్లూరు ఆస్పత్రికి వెళ్లి దివ్యాంగ పింఛన్‌ను మాగంటి అపర్ణకు శనివారం అందజేశారు. ఈమె శస్త్రచికిత్స చేయించుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

సామర్థ్య పెంపునకు కృషి చేయాలి



కొడవలూరు: తరగతికి తగిన సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ ఘనీ పేర్కొన్నారు. కొడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కొందరు విద్యార్థులు షూస్, బెల్టులు వేసుకోకపోవడాన్ని గుర్తించారు. వీటిని ధరించి పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత విద్యా వనరుల కేంద్రాన్ని పరిశీలించి మండలంలో విద్యార్థుల సంఖ్య, డ్రాపౌట్స్ నివారణకు చేపడుతున్న చర్యలపై ఎంఈఓ వసంతకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాదేవి, సీఆర్పీ పెంచలరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై అవగాహన



కొడవలూరు: కొడవలూరులోని మూలకట్ల గిరిజన కాలనీలో స్వామిత్వ సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోవర్ పరికరంతో ఇంటిని ఏ విధంగా కొలతలు తీయాలనే అంశాన్ని ప్రయోగాత్మకంగా చూపి దాని ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి విస్తీర్ణం.. నిర్మాణమెంత.. తదితర అంశాలను సమగ్రంగా తీయనున్నామని పేర్కొన్నారు. సర్వే ఆధారంగా భూ హక్కు.. భూ రక్ష పథకం ద్వారా స్పష్టతతో కూడిన పట్టాలను పంపిణీ చేయనున్నామని వివరించారు. అన్ని గ్రామాల్లో సర్వే జరుగుతోందని పేర్కొన్నారు. ఈఓపీఆర్డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు రాధాకృష్ణ, సురేష్‌కుమార్, విజయలక్ష్మి, జానకిరామయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కోటి పని దినాలు

- డ్వామా పీడీ వెంకట్రావ్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట్రావు

మనుబోలు : జిల్లాలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా కోటి పని దినాలు కల్పించామని డ్వామా పీడీ వెంకట్రావ్ తెలిపారు. మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కోటి 10 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు కోటి పని దినాలు కల్పించామన్నారు. మార్చి ఆఖరు నాటికి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం సరాసరి వేతనం రూ.230 వస్తోందని, ఎక్కువ సమయం పనిచేస్తే రూ.257 వరకు వస్తుందని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. పనులు జరిగే చోట కనీస వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ రాజమ్మ, టీఏ రమేష్, ఎఫ్ఏ మధు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం



బుచ్చిరెడ్డిపాళెం: పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎంఈఓ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందులోని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో భద్రతకు పెద్దపీట

- కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్



ప్రతిజ్ఞ చేస్తున్న సీఓఓ సంజయ్

ముత్తుకూరు : అదానీ కృష్ణపట్నం పోర్టులో భద్రతకు పెద్దపీట వేసినట్లు సీఓఓ సంజయ్ అన్నారు. 52వ జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం భద్రత వారోత్సవాల పతాకాన్ని ఆవిష్కరించారు. ఉద్యోగులు, కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'మన లక్ష్యం శూన్య హాని' నినాదంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈనెల 10వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరూ భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కర్, సైఫి, వేణుగోపాల్, రమణారావు, ఓంకార్, గంగాసతీష్ తదితరులు పాల్గొన్నారు.